క్లుప్తంగా

అన్నదాన ట్రస్ట్‌కు రూ.5 లక్షల విరాళం



బాన్సువాడ : బాన్సువాడ అయ్యప్ప నిత్య అన్నదాన ట్రస్ట్‌కు సోమవారం జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ రూ.5 లక్షల విరాళం ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లిన ట్రస్ట్ సభ్యులు అయ్యప్ప ఆలయం వద్ద నిత్య అన్నదానం కొనసాగుతుందని వివరించడంతో ఎంపీ బీబీ పాటిల్ స్పందించి రూ.5 లక్షల విరాళంను సభ్యులకు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు బెజుగం శంకర్, చంద్రోశేఖర్‌శర్మ, వెంకటేశం, మామిళ్ల రాజు, పైడిమల్ లక్ష్మీనారాయణ, రాజు తదితరులున్నారు.

రామాలయం నిర్మాణానికి..



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో నిర్మిస్తున్న రామాలయానికి భిక్కనూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పురాం రాజమౌళి–రాణి దంపతులు సోమవారం రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ మద్ది సూర్యకాంత్‌రెడ్డి, విండో చైర్మన్ నాగర్తి భూంరెడ్డి, నేతలు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



దోమకొండ: దోమకొండలో ఈ నెల 13న జరిగే మహంకాళి బోనాల పండుగకు హాజరు కావాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ఆలయ కమిటీ తరపున ఆహ్వాన పత్రిక అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సిద్దారెడ్డి తెలిపారు. హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశామన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిరుమల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఆలయ కమిటీ ధర్మకర్తలు ఎల్లం యాదవ్, రమేష్, బాలరాజ్, తదితరులున్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ప్రమీల అన్నారు. ఆమె సోమవారం కృష్ణాజీవాడిలో గల అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

ఎల్లంపేటవాసికి డాక్టరేట్

మాచారెడ్డి: ఎల్లంపేట అంకిరెడ్డిపల్లి తండాకు చెందిన బూక్యా లింగంకు వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సోమవారం రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ శర్మ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు ఆయన తెలిపారు. గిరిజనుల ఆరోగ్య స్థితిగతులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై ఆచార్య యాదగిరిరావ్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసినందుకు లింగంకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు ఏజీపీగా నవీద్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు ఏజీపీగా నవీద్ సోమవారం బాధ్యతలను స్వీకరించినట్లు న్యాయవాదులు తెలిపారు. ఇంచార్జి ఏజీపీగా ఉన్న సాయిప్రకాష్ దేశ్‌పాండే నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు ఏజీపీగా నవీద్‌ను ప్రభుత్వం నియమించడంతో ఆయన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను కలిసి శాలువాతో సత్కరించారు.

గురుకుల విద్యార్థులకు జ్వరాలు



బాన్సువాడ రూరల్: కొయ్యగుట్టలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు జ్వరాల బారిన పడ్డారు. దీంతో హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థినులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గురుకుల పాఠశాల, కళాశాల పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పలువురు విద్యార్థినులను మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పీహెచ్‌సీ ప్రారంభం ఎప్పుడో..?

ఆగుతూ..సాగుతున్న పనులు

- చికిత్స కోసం బీర్కూర్, బాన్సువాడకు వెళ్లాల్సిందే
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రూ.1.43 కోట్లతో నిర్మాణ పనులు
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న స్థానిక ప్రజలు



నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో(ఫైల్)

నస్రుల్లాబాద్: మండలాలు ఏర్పాటు జరిగి ఏళ్లు గడుస్తున్నా ఆరోగ్య చికిత్స కోసం మాత్రం పాత మండలాలు, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఇంకా ఉంది. గర్భిణులు, చిన్నారులు నెలనెలా టీకాల కోసం బీర్కూర్ వెళ్లి రావాల్సి వస్తోంది. ప్రతివారం నస్రుల్లాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల నుంచి మహిళలు ఇబ్బందులు పడుతూ పోతున్నారు. నూతన పంచాయతీ ఏర్పాటైన తర్వాత కూడా పాత మండలాలకు వెళ్లి చికిత్స చేసుకుంటున్నారు. ఈ బాధలు గమనించి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఏర్పాటుకు 15వ వార్షిక నిధులు రూ.1.43 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. మరో 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి.

అందుబాటులో లేని వ్యాక్సిన్లు

నస్రుల్లాబాద్ మండలంలో కుక్కల, కోతుల బెడద విపరీతంగా ఉంది. అటవీ ప్రాంతం దగ్గరగా మండలం ఉండటంతో పాములతో పాటు కుక్క, కోతుల కాట్లకు గురవుతున్నారు. అయితే స్థానికంగా వాక్సిన్ నిల్వ చేసే ఏర్పాట్లు లేకపోవడంతో బీర్కూర్, బాన్సువాడ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. పెద్ద గాయాలు అయితే ప్రథమ చికిత్స లేకుండా పోయేసరికి తీవ్ర రక్తస్రావమై రోగి పరిస్థితి విషమంగా మారుతోంది. మండల కేంద్రంలో నిర్మిస్తున్న పీహెచ్‌సీ పనులు పూర్తయితే రేబిస్ వ్యాధి టీకాలు కూడా అందుబాటులో ఉండి ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. పీహెచ్‌సీ అందుబాటులోకి అన్నివిధాలా సౌకర్యంగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి



నస్రుల్లాబాద్‌లో నిర్మిస్తున్న పీహెచ్‌సీకి సంబంధించిన మిగిలి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి. హాజీపూర్ నుంచి బీర్కూర్, బాన్సువాడకు వెళ్లాలంటే సుమారు 20 కి.మీలు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ లోపు ప్రాణాలు సైతం పోయే ప్రమాదం ఉంది. – కూనింటి రాము, హాజీపూర్

సమయానికి చికిత్స అందడం లేదు



మండలంలో సరైన వైద్య సదుపాయం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. పాము కాటు వాక్సిన్ సమయానికి అందక ప్రాణాలు పోతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకుని వస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. – మోసిన్, నస్రుల్లాబాద్

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



మాచారెడ్డిలో నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో దేవేందర్ రావు



డ్రెస్‌లు అందజేస్తున్న ఎంఈవో పూర్ణచంద్రరావు

మాచారెడ్డి: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే విధంగా విద్యాబోధన చేయాలని మాచారెడ్డి ఎంఈవో దేవేందర్ రావు సూచించారు. సోమవారం విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు స్వప్న, రాంరెడ్డి, సీఆర్‌పీలు సంజీవ్, మంజుల, నరేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

యూనిఫాం డ్రెస్‌ల అందజేత

రాజంపేట: ఆర్గొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం యూనిఫాం డ్రెస్‌లను అందజేసినట్లు ఎంఈవో పూర్ణచంద్ర రావ్ తెలిపారు. రెండో విడతలో భాగంగా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో హెచ్‌ఎం విజయలక్ష్మికి అందజేశామన్నారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు జంగం సుమలత, కార్యదర్శి హసీనా బేగం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పుస్తకాలు, పలకల పంపిణీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 23వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు స్థానిక వార్డు కౌన్సిలర్ తేజవు మానస, ప్రసాద్ దంపతులు పుస్తకాలు, పలకలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో షౌకత్‌అలీ సూచించారు. సోమవారం ఆయన కొండాపూర్, కొండాపూర్ డీఎన్‌టీ, లింగంపేట బాలికల ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఆర్పీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సంధ్యారాణి, గోవర్ధన్‌లాల్, దుప్యా రాథోడ్ ప్రశాంత్, సతీష్, శైలజ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాలపైకి తీగ జాతి మొక్కలు ఎగబాకాయి. కింద నుంచి పైవరకు తీగలకు అల్లుకున్నాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడమే కాకుండా అగ్ని ప్రమాదాలు, షార్ట్‌సర్క్యూట్‌లు సంభవించే అవకాశముంది. విద్యుత్ స్తంభాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. అధికారులు స్పందించి తీగ జాతి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రికి ఘన స్వాగతం



బిచ్కుంద(జుక్కల్): అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం బిచ్కుందలో ఘనస్వాగతం పలికారు. మంత్రికి క్రేన్ ద్వారా గజమాల వేసి డీజే, బ్యాండ్ మేళాలతో నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి సభ వేదిక వరకు మూడు కిలోమీటర్ల బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించి వినతి పత్రాలు అందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నరేందర్ ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు





బిచ్కుందలో బీజేపీ నేతల అరెస్టు చూపుతున్న పోలీసులు, పెద్దకొడప్‌గల్‌లో..

బిచ్కుంద/పెద్దకొడప్‌గల్ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటన సందర్భంగా సోమవారం బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ మండలాలలో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. మంత్రి పర్యటనను అడ్డుకుంటారనే ముందస్తు సమాచారం మేరకు వారిని ఇళ్ల వద్ద అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.ఈ సందర్భంగా బీజేపీ బిచ్కుంద అధ్యక్షుడు విష్ణు, బీజేవైఎం యూత్ అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ.. తమను అరెస్ట్ చేయడం సబబు కాదని అన్నారు. అభివృద్ధిపై నిలదీస్తారనే ఉద్దేశంతో కాంగ్రెస్ నేతలు అరెస్ట్ చేయించారని ఆరోపించారు.

చినుకు పడితే ఈ రోడ్డు చిత్తడే!



భిక్కనూరు: చిరు జల్లు కురిసినా మోస్తారుగా చినుకులు పడినా భిక్కనూరు మండల కేంద్రం నుంచి రామేశ్వర్‌పల్లి వెళ్లే రోడ్డు బురదమయంగా తయారవుతోంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, కాలినడకన వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి చిత్రం



రామారెడ్డి- కామారెడ్డి ప్రధాన రోడ్డుపైన కుక్కల గుంపు

కుక్కల బెడదను అరికట్టాలి

రామారెడ్డి: రామారెడ్డి శివారులోని గర్గుల్ గ్రామ సమీపంలో రామారెడ్డి–కామారెడ్డి ప్రధాన రోడ్డుపై కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే వాహనదారుల వెంట పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలి.

– ఫొటో ప్రకాష్, రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

ప్రభుత్వ పాఠశాలల సందర్శన



పిట్లం(జుక్కల్): బ్రాహ్మణపల్లి, చిల్లర్గి గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సోమవారం రాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, పాఠశాల రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, హేమలత, ఇస్మాయిల్, సిబ్బంది విఠల్, గంగాధర్, విజయ, ఆర్పీలు గోపాల్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే హామీ



దోమకొండ: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హామీ ఇచ్చినట్లు దోమకొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు తెలిపారు. సోమవారం సంఘం ప్రతినిధులతో కలిసి ఆయనను కలిసి సంఘంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్, కోశాధికారి అందె గణేష్, ప్రతినిధులు ఉన్నారు.

ఎవరికి అన్యాయం జరిగినా తక్షణమే స్పందిస్తా

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: పార్టీలకతీతంగా ఎవరికి అన్యాయం జరిగినా తక్షణమే స్పందిస్తానని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం మల్కాపూర్‌లో బీజేపీ నేత నర్సింలు అక్రమంగా ఇంటిని నిర్మించారన్న కారణంతో కూల్చి వేయడంతో ఆయన సురేందర్ పరామర్శించారు. అధికారులు కూల్చి వేసిన ఇంటిని పరిశీలించారు. అనంతరం నర్సింలుకు రూ.61 వేల ఆర్థిక సహాయం అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, జలంధర్‌రెడ్డి, సతీష్, అరవింద్ తదితరులున్నారు.

పరామర్శ

రాజంపేట: గుండారం బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కేసరి సిద్దయ్య ఇటీవల గుండె పోటుతో మరణించాడు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందదర్ సోమవారం సిద్దయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆయిల్ పామ్ మొక్కల పెంపకంపై అవగాహన



నస్రుల్లాబాద్: ఆయిల్ పామ్ మొక్కల పెంపకంతో రైతులు ఆర్థికంగా ఎదుగుతారని ప్రతి రైతు ఆయిల్ పామ్ సాగు చేయాలని హార్టికల్చర్ అధికారి సుమన్ అన్నారు. సోమవారం హాజీపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లుడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఏఈవో గోపాల్, ఆయిల్ పామ్ మేనేజర్ విక్రమ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బహుజన అలయ్ బలయ్ కరపత్రాల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 27న స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించే బహుజన అలయ్ బలయ్ కార్యక్రమ కరపత్రాలను సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు.

వేతనాలు చెల్లించాలని వినతి



రాజంపేట: వేతనాలు అందించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో రఘురాంతో పాటు డీపీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు భద్రప్ప తెలిపారు. మూడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఉన్నత అధికారులు చొరవ తీసుకొని తమకు సకాలంలో అందేలా చూడాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు



ఎల్లారెడ్డిరూరల్: రోడ్డుపై పండ్ల బండ్లు నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని పోలీసులు పండ్ల దుకాణదారులకు సూచించారు. సోమవారం గాంధీచౌక్‌లో రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న దుకాణాలను తొలగించాలని వారికి సూచించారు. దీంతో దుకాణాదారులు వాటిని తొలగించారు.

సంక్షిప్తం

అందుబాటులో జింక్

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ గ్రామ రైతువేదికలో జింక్ అందుబాటులో ఉందని క్లస్టర్ ఏఈవో రాణి తెలిపారు. 10 కేజీల బ్యాగ్ ధర రూ.400. వ్యవసాయ భూమిలో జింక్ ధాతువు లోపం ఉంటే తప్పకుండా జింక్ వేయాలని ఆమె సూచించారు. అలాగే ఆయిల్ పామ్ పంట సాగుకు ఆసక్తి ఉన్న రైతులు తనను సంప్రదిస్తే పూర్తివివరాలు అందిస్తానని కోనాపూర్ ఏఈవో జ్ఞానేశ్వర్ తెలపారు. ఈసంవత్సరానికి గానూ ప్రభుత్వం డ్రిప్‌లైన్ సబ్సిడీ అందిస్తుందన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సోయా, పెసర, మినుము పండించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు జానకంపేట పోలీసు శిక్షణ కేంద్రంలో పది రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొని విశేష ప్రతిభ చూపారు. పాఠశాల ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సృజన్, నివేదిత, రక్షితలు 12వ బెటాలియన్ అధికారి విష్ణు పి నాయర్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ఆలిండియా బంజారా సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆలిండియా బంజారా సేవా సంఘం నాగిరెడ్డిపేట మండలం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొర్ర వసురాం, మండలాధ్యక్షుడిగా దేవసోత్ రమేష్, ఉపాధ్యక్షులుగా బాబు, వసురాం, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా సర్వన్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా మాలోత్ గోప్యా, కమిటీ సభ్యులుగా గోపి, కిషన్, పీర్యా, లాలు, చందు ఎన్నికయ్యారు.

ఎల్లారెడ్డి బంజారా సంఘం అధ్యక్షుడిగా..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల బంజారా సంఘం అధ్యక్షుడిగా రాములు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బంజారా సంఘం నాయకులు తెలిపారు. సోమవారం బంజారా సంఘంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాములు నాయక్‌ను మండల అధ్యక్షుడిగా, కార్యదర్శిగా సర్దార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రాములు నాయక్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మ సాయిబాబా అభినందించారు.

పరువు నష్టం కేసు వేస్తాను

ఎల్లారెడ్డి: తనపై అసత్య ఆరోపణలు చేసిన నర్సింలుపై పరువు నష్టం కేసు వేస్తానని డీఎల్‌పీవో సురేందర్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నర్సింలు అధికారులపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 2021లో నర్సింలు మల్కాపూర్‌లో తన ఇంటి నిర్మాణం కోసం జీపీలో అనుమతి తీసుకున్నారని, అనుమతి రెండు సంవత్సరాల వరకు మాత్రమే ఉంటుందన్నారు. 2023 వరకు ఇంటి నిర్మాణం చేయకపోవడంతో దాని అనుమతి ముగిసిందన్నారు. ఇంటి అనుమతి కోసం రెన్యువల్ చేసుకోవాల్సి ఉన్నప్పటికి చేసుకోలేదన్నారు. గ్రామసభలో సైతం అక్రమంగా నిర్మించిన స్థలంలో ఇంటి నిర్మాణం నిలిపి వేయాలని తీర్మానం చేసినా ఖాతరు చేయకుండా ఇంటి నిర్మాణం చేశాడన్నారు. ఈ విషయం అడిగితే బెదిరింపులకు పాల్పడ్డాడని అన్నారు. ఎంపీడీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ తదితరులున్నారు.